శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై! సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై!


# గురుకృప

గురుర్దేవోభవ




సాయి శక్తికి సజీవ రూపం
సంచరించే దైవత్వం,
రూపుదాల్చిన సద్గురుతత్త్వం.
సాయి సాంప్రదాయ పరిపూర్ణతకై
మానవాళి మనోద్ధరణకై
సాయి ప్రసాదించిన మహిత వరం..

# జన్మదిన సంచిక

గురోవినతిమీ కరీ హృదయ మందిరీ యా బసా! సమస్త జగ్‌హే గురు స్వరూప చీ రసో మానసా!
కరో సతత సత్కృతీ మతిహిదే జగత్పావనా!

# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాధుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీ బాబూజీ



## లీల ~ పుట


| | | | |
|---|---|---|---|
| 1. సాయివంటి దైవంబు లేడోయి..లేడోయి... | శ్రీ బాబూజీ | .................. | 2 |
| 2. ఉన్నమాట - అనుకున్నమాట | గురుబంధువులు | .................. | 3 |
| 3. దృష్టి । వృష్టి | మారుతీరావు, బోధన్ | .................. | 6 |
| 4. రాజు । కవి | చంద్రకుమార్, హైదరాబాద్ | .................. | 9 |
| 5. ప్రేమ । రక్ష | సుష్మా వెంకట్, చెన్నై | .................. | 10 |
| 6. ఓర్పు । నేర్పు | పవన్ , చెన్నై | .................. | 12 |
| 7. సుమం । సౌరభం | ఈశ్వరరావు, తెనాలి | .................. | 16 |
| 8. గురుర్దేవోభవ | గురుకృప | .................. | 17 |






సంపుటి : 11
సంచిక : 1

త్రైమాసిక పత్రిక
జనవరి 2008

నిర్వహణ
గురూజి
ఆశీస్సులతో
గురుబంధువులు

చిరునామా
గురుకృప
2-1-6
గాంధీచౌక్,
తెనాలి.

ఫోన్ :
08644-
227194

ముద్రణ
రామకృష్ణ ప్రింటర్స్
విశాఖపట్నం

ఫోన్స్ :
2798072
2740222

**శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై!!**
**సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై!**

# గురుకృప

## ఉన్నమాట - అనుకున్నమాట

సద్గురుతత్త్వానికి ఒక పూర్తి స్వరూపం ఈ భువిపై అవతరించిందంటే అది సద్గురు సామ్రాట్టు శ్రీ సాయిబాబా. అట్టి మహోన్నత రూపం భరతజాతి ఆధ్యాత్మికతకు, సద్గురుతత్త్వానికి, మానవజాతి మనుగడకు చక్కటి భాష్యాన్నిచ్చి, ఆనందపథాన్ని చూపింది. మానవ జీవనానికి అన్నపానీయాలెంత అవసరమో - ఆధ్యాత్మిక జీవనానికి సద్గురువు అంత ఆవశ్యకమని మహాత్ముల మాట. ఎందరో మహాత్ములు చరించిన భువిపై 'సాయి' సామ్రాట్టుగా కొలవబడటం అతిశయోక్తా! అంటే ఆలోచిద్దాం - చింతపల్లి అడవుల్లో ఉంటూ ఎందరో ముముక్షువులకు, పామరజనానికి జ్ఞానాన్నందించి, ఆశ్రయించినవారిని ఆదుకున్న శ్రీ పాకలపాటి గురువుగారు ఎంతమంది ఆయన చెంతకు వస్తే అంతమందికి ఏ సమయంలోనైనా షడ్రసోపేతంగా భోజనాన్ని వడ్డించేవారని ప్రతీతి. ఇట్టి సంఘటనలు మహాత్ముల చరిత్రలలో ఎన్నైనా చూడవచ్చు. అయితే మనం సాయి చరిత్రను గమనిస్తే తన చేతికొచ్చిన పంటనంతా సాయికి సమర్పించి - సాయి ఇచ్చిన దానిని ఇంటికి తీసుకెళ్ళే బాలాజీపాటిల్ నేవాస్కర్ మనకు సుపరిచితుడే కదా! అతని సంవత్సరీకానికి ఊహించిన దానికంటే మూడురెట్లు మనుషులు భోజనానికి రావడం, ఆ సందర్భంలో ఆదుర్దాపడ్డ నేవాస్కర్ భార్యతో ఆమె అత్తగారు "భయపడకుము. ఇది మనది కాదు, ఇది సాయి ఆహారమే. అన్ని పాత్రలు గుడ్డలతో పూర్తిగా కప్పివేయుము. వానిలో కొంచెం ఊదీ వేయుము. గుడ్డ పూర్తిగా తీయకుండ వడ్డన చేయుము, సాయి మనలను కాపాడును" అంటూ వచ్చిన బంధువులందరికి భోజనాన్ని వడ్డిస్తారు సమృద్ధిగా. భోజనంలో ఎవ్వరికీ ఎటువంటి





లోటు ఉండదు. ఎందరో మహాత్ములు చేసిన లీలలను, సాయి తన బిడ్డలచేతనే చేయించడం ఆధ్యాత్మిక జగత్తులోనే వినూత్నం. 'మనిషి దైవంగా పెరగడమే' తన అవతారకార్యంగా స్వీకరించిన సాయి 'సామ్రాట్టు' కావడంలో ఇక ఆశ్చర్యమేముంది. మన చేయిపట్టి నడిపించి, మనలను తనలా చేయాలని తపించే కరుణామూర్తి శ్రీసాయి. అట్టి సద్గురు సామ్రాట్టు చూపిన శుభ్ర మార్గం 'సాయిపథం'. సాయి శుభ్రమార్గంలో సాయి శక్తికి సజీవరూపం, సంచరించే దైవత్వం... రూపుదాల్చిన సద్గురుతత్త్వం .. సాయి సంప్రదాయ పరిపూర్ణతకై మానవాళి మనోద్ధరణకై, సాయి ప్రసాదించిన మహితవరం .. శ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ. సాయి అనే శుభ్రమార్గంలో ప్రతీ మనిషి పయనించాలనే తహతహ తన తనువంతా నిండగా, ఈ మానవాళి ఉద్ధరణకై సగుణ రూపుదాల్చిన సద్గురుమూర్తి శ్రీబాబూజీ.

ఓ వంక సద్గురుసామ్రాట్టు - మరొకవంక సద్గురు సామ్రాట్టు చరణ కమలాలే లక్ష్యమని తెలియచెప్పే సద్గురుమూర్తి - ఇక కావల్సిందేముంది. మన పని చాలా సులభం - అటు బాబా చెప్పిన వాక్కును తూ.చ. తప్పకుండా పాటించేవారికి, సద్గురుమూర్తి శ్రీబాబూజీ మాటనే బాటగా చేసుకొనే వారికి ఇక చింతలేదు. ఎల్లరకూ విజయమే! సర్వమూ శుభమే! సాయి - గురువుకు అంకితమవమని చెప్పినా, గురుదేవులు - బాబానే సర్వమని వచించినా మనం గమనించాల్సిన అంశం - సర్వులకూ శ్రేయోదాయకమైన సద్గురు శరణాగతి తత్త్వాన్నే. ఈ క్రింది అంశాలనన్నింటిని క్రోడీకరించుకుంటే శరణాగతి తత్వంలోనే మొత్తం ఆధ్యాత్మికత దాగి ఉందేమోనన్న సందేహం మనకు కలుగక మానదు. మొదటగా శ్రీసాయి మాటలే గమనిద్దాం. " నా కన్నుల్లో గురువు రూపం ప్రతిబింబించకపోతే, ఆ కండ్లు మాంసపు గోళీలు మాత్రమే. ఇలాంటి కన్నులతో ఉండటం కన్నా, నేను గ్రుడ్డివానిగానే ఉండటం మేలు. నా ధ్యానానికి ధ్యేయం కేవలం గురురాయుడే. ఈ విశ్వమంతా అతని స్వరూపమే. నాకు గురువుకన్నా మరేమి గ్రాహ్యం కావటం లేదు. దీనినే అనన్యచింతన అంటారు". సాయి మాటలు మనకు అత్యుత్తమమైన సద్గురు శరణాగతి తత్త్వాన్ని చక్కగా ద్యోతకపరుస్తున్నాయి. ఆదికావ్యమయిన రామాయణాన్ని గమనిస్తే " శ్రీరామచంద్రుడే సగుణుడు, అతనే నిర్గుణుడు. రాముడు పరిపూర్ణ పరమాత్మ. చిన్మాత్రైక చైతన్య స్వరూపుడైన శ్రీరాముడు జగజ్జీవనుడు" అంటారు వాల్మీకి. ఇక భారతానికి వస్తే ప్రహ్లాదోపాఖ్యానంలో " సర్వమున్ అతని దివ్యకళామయమనుచున్ " అంటూ ఈ జగత్తంతా శ్రీహరి చేసే కళ మాత్రమే అంటాడు ప్రహ్లాదుడు. భగవద్భక్తుల గాథల సంపుటి భాగవతం చూస్తే " విష్ణుండు విశ్వంబు విష్ణునికంటెను

వేరేమియును లేదు" అంటూ ప్రవచిస్తాడు వ్యాసమహర్షి. ఇక పూజ్య గురుదేవుల ఈ మాటలను గమనించుకుందాం. "ఎవరికో దర్శనమిచ్చేందుకు నేను సత్సంగ మందిరానికి రావడం లేదు. నేను వచ్చేది దర్శనం చేసుకునేందుకు. అయినా ఒకరికి దర్శనమిచ్చేందుకు మనమెంతటివారము? మనందరికి సర్వదా బాబానే దర్శనీయుడు. అంతమంది సాయిభక్తుల ముందు కూర్చున్నపుడు నాకు 'సహస్రశీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్' అన్న వేద సూక్తము స్ఫురణక వస్తుంది. సహస్ర శిరస్సులతో, సహస్ర నేత్రాలతో శ్రీసాయి తన విరాట్ స్వరూపంతో దర్శనమిచ్చి, ప్రసన్న దృష్టితో చూస్తున్నారనిపిస్తుంది. ఆ విరాట్ స్వరూపాన్ని దర్శించుకోవడమే నేను చేసేది." ఇలా ఏ పురాణేతిహాసాలను గమనించినా మనకు అవగతమయ్యే అంశం "అనన్య భావంతో ఎవరైతే మహాత్ముని ఆశ్రయిస్తారో వారికి ఆ మహాత్ముని రూపమే ఈ జగత్తంతా భాసిస్తూ, అట్లా అనన్యచింతన చేసేవారి మాట, బాట ఈ మానవాళి ఉద్ధరణకు మార్గాన్ని చూపే వెలుగు దివ్వె అవుతుంది". ఈ పురాణేతిహాసాల కోణానికి - బాబా చెప్పిన మాటలకు సారూప్యం, విశ్లేషణ - పూజ్య బాబూజీ మాటల్లోనే చూస్తే "నిజానికి, ఆత్మజ్ఞానానంద పరవశులైన మహాత్ముల అనుభూతుల స్మృతులే మానవాళికందిన మహితశ్రుతులు వారి చర్యలే మానవ ధర్మశాస్త్రాలకు ఆధార స్మృతులు. తరచిచూస్తే సకల శ్రుతి స్మృతి పురాణేతిహాసాల సారం - శ్రీసాయిబాబా వంటి మహాత్ముల సచ్ఛరితల సారమే కదా!" గురుబంధువుల్లారా, ఇక్కడ మరొక్క అంశాన్ని మనం తప్పక మననం చేసుకోవాలి. - **"అనన్యమైన ప్రేమ మాత్రమే భక్తి"** అంటూ నారదమహర్షి భక్తిని నిర్వచించాడు. సద్గురువుపట్ల మనకు అట్టి అనన్యమైన ప్రేమ కలగాలని, శ్రీసాయి మనకు ఆచరించి చూపిన సద్గురు శరణాగతి పథంలో పయనించి మనమందరం సద్గురు పదసన్నిధిని చేరి శాంతి, ఆనందాలతో పరవశించాలని ఆకాంక్షిస్తూ, నూతన సంవత్సర శుభవేళ సద్గురు దర్శన, వీక్షణ, భాషణాలను ఆశిస్తూ .... **- గురుబంధువులు.**

***ప్రపంచంలో గొప్ప దాతలైనవారు కూడా మహాత్ములకు దాసులయ్యారు. అందుకే, పరిపాలించే ప్రభువును రాజు అని, పరిరక్షించే సద్గురుని మహరాజు అని పిలుస్తాము.***

గురుబంధువులు వారి, వారి అనుభవాలను, అనుభూతులను
**gurukrupa@saimail.com** కు పంపగలరు.
ఇంటర్‌నెట్‌లో "గురుకృప" : **www.guruji.org**

# దృష్టి - వృష్టి

సాయి లీలలు అగ్రాహ్యాలు. సాయి చర్యలు అగాధాలు. అందుకే 'ఎవరైతే నా లీలలు మననం చేస్తూ అందులోనే మునిగి పోతారో వారికి జ్ఞానరత్నాలు లభిస్తాయి' అంటారు శ్రీసాయి. సద్గురుమూర్తి ప్రేమతో అందిస్తున్న మరొక జ్ఞాన రత్నం ఈ అనుభవం. బొంబాయి వాస్తవ్యుడైన యశ్వంత్‌దేశ్‌పాండే తన తాతగారికి ఎన్ని చికిత్సలు చేసినా దృష్టి లోపించడంతో సాయిమహరాజ్‌ను ఆశ్రయిస్తారు, బాలక్‌రామ్ మాన్కర్ మిషగా. బాబా దక్షిణ కోరగా చిల్లర కోసమై వెళ్ళి తిరిగివచ్చి సాయికి దక్షిణ సమర్పిస్తాడు. దక్షిణ సమర్పించగానే సాయి అంటారు - "భయపడకు, భగవంతుడు మేలు చేస్తాడు. నీవు వచ్చిన పని ఎప్పుడో పూర్తయింది. మీరిక వెళ్ళవచ్చు". మసీదు బయటకు వచ్చేసరికి తాతగారు కన్పించడు. ఆదుర్దాతో యశ్వంత్ పెద్దగా ఏడుస్తాడు. దగ్గరుండి ఒక పెద్ద మనిషి తాతగారి దగ్గరకు తీసుకువెళ్తాడు. ఆదుర్దా పడుతున్న మనవడితో తాత అంటాడు - 'చిన్నా! నీవు చిల్లరకోసం వెళ్ళగానే కొద్ది క్షణాల తర్వాత నా కళ్ళు కన్పించనారంభించాయి! అందరికీ ఆశ్చర్యం. ఇదీ సాయిసుమధుర లీలావినోదం. సద్గురుమాయి చల్లని కృపాదృష్టి అప్పుడు ఇప్పుడూ అవిరాళంగా, అప్రతిహతంగా వర్షిస్తూనే ఉంది - ఈ అనుభవంతో సద్గురు అనుగ్రహాన్ని మరొక్కసారి చక్కగా ప్రోది చేసుకొని తన్మయమవ్వండి.

**- గురుకృప**

మా బోధన్ పూర్వం చారిత్రకంగా ప్రసిద్ధికెక్కిన ఊరు. పూర్వం దీనిని మహాభారతంలో ఏకచక్రపురం అని పిలిచేవారు. పాండవులు కుంతి దేవితో చాలాకాలం ఇక్కడ అజ్ఞాతంగా గడిపిన ఊరు. లక్క ఇల్లు కాలిపోయిన తర్వాత ఇక్కడికి వచ్చి చాలా కాలం వసించారట. ఆ రోజుల్లో భీమసేనుడు, బకాసురుడు అనే రాక్షసుడిని చంపిన ఆనవాళ్ళు ఇక్కడ ఇప్పటికీ చారిత్రకంగా నిలిచిపోయి ఉన్నవి. ఇక్కడ గురువుగారు 8 సం॥ల క్రితం కొత్తగా కట్టిన సాయి మందిరంలో సాయిబాబా విగ్రహప్రతిష్ఠాపన చేసినారు. ప్రతి సంవత్సరము ప్రతిష్ఠాపనావార్షికోత్సవం, సత్సంగ వార్షికోత్సవం ఘనంగా జరుపుకొంటాము. వార్షికోత్సవానికి 15రోజులు ముందు నుండి సాయిచరిత్ర పారాయణ చేసుకొంటారు. చాలమంది ఈ 15 రోజుల్లో పారాయణ చేయడం నియమంగా పాటించుచున్నారు. నేను కూడ ఈ నియమం పాటిస్తూ సాయి సచ్చరిత్ర పారాయణ చేస్తుండేవాడిని. నా వయస్సు 65 సం॥ కంటి అద్దాలు లేకుండా పారాయణ చేయలేనివాడిని. ఒకరోజు యదావిధిగా పారాయణ చేయడానికి వచ్చాను. కాని కంటి అద్దాలు ఇంట్లోనే మరచి వచ్చాను. సాయిబాబా మందిరం నుంచి మా ఇల్లు రెండున్నర కిలోమీటర్లు ఉంటుంది. తిరిగి వెళ్ళడం కష్టమనిపించి

చేయునది లేక ఎలాగయిన కొంతవరకు అనగా ఒక పేజీ లేదా అరపేజీ పారాయణ చేసి వెళ్ళాలని నిర్ణయించుకొన్నాను. కంటి అద్దాలు లేకుండా పారాయణ చేయించమని బాబాను వేడుకొని చదవడానికి ఉపక్రమించాను. నా పట్టుదలకు బాబా కరుణించారు. అంతే అద్భుతమైన లీల జరిగింది. నా కండ్లకు కంటి అద్దాలు లేకుండానే చాలా స్పష్టంగ అక్షరాలు కనబడుతున్నవి. నేను చక్కగా పారాయణ చేసుకోగలుగుతున్నాను. నా ఆశ్చర్యానికి అంతు లేదు. ఈ వింతను నా ప్రక్కన కూర్చొని ఉన్న మందిర ప్రెసిడెంటు శ్రీ ఎమ్. వెంకటేశ్వరరావు గారికి చెప్పాను. ఆయన ఈ లీల చూసి బాబాకు సాష్టాంగ నమస్కారం చేశారు. అప్పటి నుంచి నా కంటి దృష్టి అలాగే ఉండిపోయింది. ఎంతటి చిన్న అక్షరాలు అయినా నేను చదవగలిగే స్థితికి వచ్చాను. ఈ ఘటన జరిగి రెండున్నర సంవత్సరాలు దాటిపోయింది. ఇప్పటికీ నేను కంటి అద్దాలు లేకుండానే చదవగలుగుతున్నాను. ఎలాంటి కంటి ఆపరేషన్ లేకుండానే బాబా నా కంటి దృష్టి పెంచేశారు. బాబా వైద్యులకు వైద్యుడు. ఎలాంటి ట్రీట్‌మెంట్ లేకుండానే నా కంటి దృష్టి పెరగడం బాబా చూపెట్టిన అద్భుత లీల.

ఇలాగే మరియొక లీల జరిగింది. మూడు సంవత్సరముల క్రితం అంతకు ముందు నాకు లేని షుగర్ పెరిగింది. అది నాకు తెలియదు. నేను యదేచ్ఛగా స్వీట్స్ తింటూపోయాను. ఇది ఇలాగే ఉంటే అపాయం అని సర్వాంతర్యామి అయిన బాబా నాకీ సంగతి తెలుపడానికేనేమో, ఒకరోజు అనుకోకుండా నా కాలు ఒక చెక్క పైన ఉన్న మేకుమీద పడింది. కాలికి మేకు గుచ్చుకొని రక్తం చిమ్మింది. నాకు అంతకు ముందు (షుగర్ లేనప్పుడు) ఎలాంటి ఇనుప వస్తువులు గుచ్చుకొన్నా (నేను పని చేసే ఫ్యాక్టరీలో) నేను టి.టి. ఇంజెక్షన్ చేయించుకొనేవాడిని కాను. అంతగా పట్టించుకొనేవాడిని కాను. నాకు పుండు కాని గాయం కాని అయ్యేడిది కాదు. అందుచేత అశ్రద్ధ వహించేవాడిని. నాకు మేకు గుచ్చుకొన్న తరువాత కూడా ఇలాగే అశ్రద్ధ వహించాను. కాని నాకు షుగర్ పెరిగినందువల్ల నా కాలు మూడు రోజుల తర్వాత ఉబ్బింది. అది చూసి నేను డాక్టరును సంప్రదించాను. డాక్టరు గారు చెక్ చేసి షుగర్‌టెస్ట్ చేయించారు. అప్పుడు కానీ నాకు షుగర్ బాగా పెరిగిపోయిందని తెలియలేదు. డాక్టరుగారు మందులు ఎన్ని ఇచ్చినా కాలు నొప్పి, గాయం తగ్గడంలేదు. చివరకి కాలు సెప్టిక్ క్రింద మారిపోయింది. డాక్టరుగారు నన్ను స్వీట్స్, పండ్లు, టీ అసలు తీసుకోవద్దని చెప్పారు. కాని నేను సాయిమందిరంలో రోజూ పగటిపూట ఆరతి, రాత్రిపూట శేజారతికి వెళ్ళేవాడిని. అక్కడ రోజూ సత్సంగం జరుగుతుంది. శేజ్ ఆరతి అయిన తరువాత రోజూ



స్వీట్స్ పంచేవారు. భక్తులు తెచ్చే పండ్లు, స్వీట్స్, రొట్టె, సీరా వగైరా ప్రసాదంగా పంచేవారు. డాక్టరు వద్దన్నా నేను బాబా ప్రసాదం కనుక బాబాకు మ్రొక్కుకొని బాబా పైన భారం వేసి తినేవాడిని. నా షుగర్ పెరిగిపోయింది. డాక్టరు స్వీట్స్ తింటే చేయునది లేక కాలు క్రింది భాగం పాదం పూర్తిగా తీసివేయక తప్పదు అన్నాడు. నేను చేయునది లేక బాబా పైన భారం వేసి రోజూ ప్రసాదం తింటు, కుంటుతూ బాబా మందిరానికి ప్రదక్షిణ చేసేవాడిని. నా ఈ బాధ మా సత్సంగ సభ్యుడయిన శ్రీ సాంబశివరావు గారికి చెప్పాను. ఆయన రోజూ బాబా ఊదీ తీసుకోమన్నారు. నేను అలాగే చేసేవాడిని. మా సత్సంగ హాలులో బాబా, గురువుగారి ఫోటోలకు ముందు అగరుబత్తులు కాలగా క్రిందపడిన బూడిదను ఊదీగా భావించి రోజూ తినేవాడిని. అంతే! నా కాలులో గాయం, నొప్పి తగ్గడం మొదలుపెట్టాయి. అలాగే ఒక ముస్లిం అతను కాలుకు మినపప్పు పిండి మరియు మేకపాలు కలిపి పట్టీ కట్టమన్నారు. ఇది బాబా చూపిన మందు అనుకొని నేను అలాగే పట్టీ కట్టడం మొదలుపెట్టాను. బాబా ప్రసాదంలో వచ్చిన స్వీట్స్ కూడా డాక్టరుగారి మాటలను లెక్క చేయకుండా,తింటూ వచ్చాను. దాంతో అతి ప్రమాదకరమైన నా కాలు పాదం గాయం, పుండు ఒకరోజు పగిలిపోయింది. పాదంలో నిండిన చీము, నెత్తురు బయటకు కారడం మొదలుపెట్టి పాదంలో రెండు వైపుల రంధ్రాలు పడి మొత్తం చీము, నెత్తురు పూర్తిగా బయటకు కారిపోయి కాలు చాలా తేలిక అయిపోయింది. నొప్పి తగ్గిపోయింది, గాయం మానిపోయింది. బాబా ఊదీ మహిమకు నేను ఆశ్చర్యపోయాను. డాక్టరుగారు షుగర్ పేషంటయిన నాకు అంత ప్రమాదకరమైన పుండు తగ్గిపోయినందుకు చాలా ఆశ్చర్యపోయారు. ఒక షుగర్ పేషంటు తీపి పదార్థాలు తింటే, గాయం మానుట చాలా ఆశ్చర్యకరమైన లీల. బాబా గారి లీలకు నేను చాలా ఉబ్బి తబ్బిబైపోయాను. నా కాలు ప్రమాదం తప్పిపోయింది. లేకుంటే డాక్టరుగారి సలహా ప్రకారం నా కాలు పాదంను తీసివేయవలసి వచ్చేది. నేను అవిటివాడినయ్యేవాడిని. డాక్టరుగారి చికిత్సకు సాయిబాబా చికిత్సకు ఎంత తేడా ఉందో ఈ లీల మూలంగా అర్థమవుతుంది. బాబా ఊదీ లీల చాలా విచిత్రంగా ఉంటుంది. బాబా బతికి ఉన్నప్పుడు ఒక భక్తుడికి కండ్లు బాగా ఎర్రబడి ఉబ్బినందుకు బాబా అతని కండ్లకు జీడిగింజలు నూరి కండ్లపైన పెట్టి పట్టీ కట్టారు అని సాయి చరిత్ర చెబుతుంది. జీడి గింజలు నూరి కండ్లకు కట్టడం అతి ప్రమాదకరం. బాబా చికిత్స చాలా విచిత్రంగా ఉంటుంది. దాంతో కండ్ల వ్యాధి పూర్తిగా తగ్గిపోయింది. ఆ భక్తుడు కూడా ఆశ్చర్యపోయాడు. ఇది బాబాను నమ్ముకొన్న భక్తులకు బాబా చేసే విచిత్రమైన చికిత్స. ఇది నా జీవితంలో జరిగిన అద్భుతమైన లీల.

**-మారుతీరావు, బోధన్**





# రాజు - కవి

నానాసాహెబ్ నిమోన్కర్ అనే భక్తునికి సంస్కృత భాగవతం నిత్యపారాయణ చేయాలని ఉండేది. అయితే అతడికి సంస్కృతం రాదు. బాబా ఒకరోజు " కాకా, నీవు భాగవతం చదవరాదా? " అన్నారు. తనకు సంస్కృతం రాదని చెప్పగా సాయిమహరాజ్ " ఏమీ పరవాలేదు - ఈ మసీదు తల్లే నీకు సంస్కృతం నేర్పుతుంది. నువ్వు చదువుతూ ఉండు. క్రమంగా అదే అర్థమవుతుంది" అన్నారు. అలా నిమోన్కర్ సాయికృపతో పండితులకు కూడా సందేహాలను నివృత్తి చేయగలిగేవాడట. సాయిమహరాజ్ ఇలా ఒక సామాన్యుని పండితుని చేసిన వైనం జ్ఞప్తికి తెచ్చుకుంటూ - అనుగ్రహ రారాజు సామాన్యునితో చెప్పించిన ఆశుకవిత్వాన్ని ఆస్వాదించండి. **-గురుకృప**

ఒకసారి పూజ్య గురుదేవులతో రాజమండ్రి నుండి భద్రాచలం వరకు బోటులో వెళ్ళే అదృష్టము కలిగింది. ఆ యాత్ర మరువలేనిది. ఎంతో అద్భుతమైనది. గురువుగారిని దగ్గర నుండి చూసే అవకాశం లభించింది. ఆయన సన్నిధానంలోని దివ్యత్వపు అమృతపు రుచిని చూసే భాగ్యము కలిగినది. రాత్రిపూట కొండ మీద నుండి గురువుగారు వస్తున్నారు. కొద్దిగా వెన్నెల వెలుతురు ఉంది. ఎవరో లైటు పట్టుకొని గురువుగారి ముందు నడుస్తున్నారు. గురువుగారు తెల్లని వస్త్రాలలో ఉన్నారు. ఆ తెల్లనివస్త్రాలు, ఆయన వర్చస్సు, ఆ ముఖంలోని వెలుగు ఆవెన్నెలలో మరింతగా వెలిగిపోయి దేవలోకము నుండి ఆ దైవమే భువికి దిగితే ఎలా ఉంటుందో అలాంటి భావన కలిగింది. ఆ దేవాధిదేవుడు ప్రసన్న వదనంతో ఆకాశం నుండి కొండ మీదుగా భువికి వస్తున్నారా ఏమీ! అనే ఆలోచన హృదయాన్ని పులకించి వేసింది. ఆ రోజు రాత్రి గురువుగారు గురుబంధువులతో వెన్నెల రాత్రిలో ఇసుక తిన్నెమీద కాసేపు మాట్లాడారు. ఆ సంభాషణ ఎంత ఉత్సాహకరంగా ఉందో మాటల్లో చెప్పలేము. మాటల సందర్భముగా ఎవరైనా ఆశుకవిత్వము చెప్పండి అన్నారు గురువుగారు. ఎటువంటి ప్రయాస లేకుండా నా నోటివెంట ఈ వాక్యాలు వచ్చినాయి .

పాపికొండల మధ్యలో
పాల వెన్నెల వెలుగులో
పరవశించెను గోదావరి
పరమ పురుషా నీ పాదాలు కడిగి..
శరత్ బాబా నీ పాదాలు తాకి...

సామాన్యులతో కూడా సద్గురువు వేదం పలికించగలరన్న దానికి ఇది ఒక సాక్ష్యమనిపించింది.

**- చంద్రకుమార్, హైదరాబాద్**



# ప్రేమ-రక్ష

కట్టెలకు మారుగా చేతినే ఉంచి కొలిమి చేరబోయిన బిడ్డను కాపాడెను సాయి - ఆ దృశ్యమటులున్న - అదృశ్యముగా అనుక్షణము ఆశీర్వదించుచు 'సాయిప్రేమ'ను నేడు రక్షించారు సద్గురుమాయి. బిడ్డ కొలిమిలో పడుతుందంటే తల్లి హృదయం తల్లడిల్లిపోదు! జగద్రక్షకుడైన సాయి నాడు ఆ తల్లి శోకసముద్రంలో మునిగిపోకుండా తన చేయిని చాచి రక్షించిన వైనానికి ఏ మాతృమూర్తి హృదయమైనా తన్మయమవుతుంది. నాటి ఈ అనుభవంలో బిడ్డ - తల్లి, తండ్రుల సంరక్షణలోనే ఉంది - కానీ గమనించాల్సింది - సంరక్షణ మనదైతే - అనుక్షణము రక్షణ సద్గురుమాయిది. ' సాయిప్రేమికులకు' - బాబూజీ 'మాయి' రక్ష సహజం, స్వాభావికం. ఇది స్వానుభవం. . . . .

-గురుకృప

నా పేరు సుష్మ. నేను కోరుకున్నట్టుగానే గురువుగారు ఆయన సన్నిధిలోనే గురుబంధువు (వెంకట్, ఒంగోలు) ని యిచ్చి నా వివాహం చేశారు. ఆయనకు నేను జన్మజన్మలకు ఋణపడి ఉంటాను. మాకు 2004 ఏప్రిల్‌లో ఒక పాప పుట్టింది. నాకు, గురువుగారు తమ చేతిలోకి నా బిడ్డను తీసుకొని గురుస్థానంలో (సాయిపథంలో పాద దర్శనం ఇచ్చే చోటు) పేరు పెట్టాలని ఎంతో కోరికగా ఉండేది. కాని మా పాప వంతు వచ్చేసరికి గురువుగారు పర్సనల్‌గా పేర్లు పెట్టడం మానేశారు. గురువుగారు పిల్లలకు పెట్టేపేర్లు అమ్మగారు, నరేంద్రన్న ద్వారా వచ్చేవి. ఆ ట్రిప్‌లోనే గురువుగారు పాపకి అన్నప్రాసన చేశారు. అప్పుడు పేరు పెట్టాలి సార్ అంటే 'వుండండి' అని చెప్పారు. పేరు కోసం చాలా ఆతృతగా ఎదురుచూస్తున్నాం. ఆ ట్రిప్‌లో దాదాపు 10 మంది పిల్లలు ఉన్నారు. అందరికీ పేర్లు పెట్టేశారు. ఇంకా మా పాపకు పెట్టలేదు. నరేంద్ర అంకుల్‌కి చెబితే ఆ మర్నాడు అమ్మగారు చెప్తారు అన్నారు. సరే అని తరువాత రోజు నేను, వెంకట్ చాలాసేపు గురుచరణ్ దగ్గర అమ్మగారికోసం ఎదురు చూశాము. అమ్మగారు రాకపోయేసరికి మందిరానికి వెళ్ళాము. అక్కడ గురుస్థాన్‌లో పాపకు పాలు పడుతున్నాను. అప్పుడు వెంకట్, అమ్మగారు ఊదీ లైనులో ఉన్నారు వెళ్ళి అడుగుదామా? అన్నాడు. అలా అడగడం సరికాదని మరలా కూర్చొన్నాము. అంతలో అమ్మగారు గురుస్థాన్‌కు వచ్చారు. మమ్మల్ని చూశారు. పాప పేరు గురించి అడిగాము. అమ్మ పాపను తమ చేతుల్లోకి తీసుకొని దాన్ని ప్రేమగా చూస్తూ 'సాయిప్రేమ' అని చెప్పారు. నా ఆనందానికి అవధులు లేవు. ఎందుకంటే గురువుగారి గురుస్థానంలో పాప నామకరణం జరగడం లేదని బాధ పడుతుండగా ఆయన బాబా గురుస్థానంలో నా బిడ్డకు ప్రేమగా సాయిప్రేమ అని నామకరణం చేశారు.

గురువుగారి ఆశీస్సులతో 8 నెలల క్రితం మేము చెన్నైకి వచ్చేశాము. అయితే ఆగస్టులో ఒకసారి ఒంగోలు వెళ్ళాము. రైలు దిగిన తరువాత స్టేషన్ బయటకు వచ్చి, వెంకట్ ఆటో మాట్లాడారు. మేము ఎవరము ఎక్కకుండానే సాయిప్రేమ పరిగెత్తుకుంటూ వెళ్ళి ఆటో ఎక్కేసింది. అది ఎక్కిన తరువాత మేము కూడా ఆటో ఎక్కబోతున్నాము. అంతలో పోలీస్ వచ్చి ఆటోని బయటకు తీసుకువెళ్ళమని తొందర చేశాడు. దాంతో ఆటోలో సాయిప్రేమ ఒక్కతే ఉండగా ఆటో కదిలింది. మేము బయటకు వెళ్ళాకగాని ఆటో ఎక్కడానికి లేదు. కానీ ఆటో వెనుకగానే ఉన్నాం. సాయిప్రేమ బాగా భయపడి ఏడుస్తుంది అని అంటూ నేను భయపడుతున్నాను. ఇంతలో చూస్తుండగానే సాయిప్రేమ మేము ఎక్కలేదని బాగా భయపడి, కదులుతూ ఉన్న ఆటో నుండి దూకేసింది. దాంతో ఆటో క్రింద పడిపోయింది. నా కళ్ళ ముందు ఏమి జరుగుతున్నా ఆపలేని పరిస్థితి. నాకు ఏం చేయాలో అర్థం కాలేదు. ఒక్కసారి పెద్దగా అరిచి నా చేతిలోని బ్యాగ్స్ విసిరేసాను. వెంకట్ పరిగెత్తుకుంటూ ఆటో దగ్గరకు వెళ్ళాడు. సాయిప్రేమ మీద ఆటో ఉంది. ఆటో డ్రైవర్‌కు ఏం చేయాలో తోచక ఆటోని అటు ఇటు మూవ్ చేస్తున్నాడు. వెంకట్ భయపడుతూ ఆటో ఎత్తడానికి ప్రయత్నిస్తున్నాడు. పాప మీద అలా ఆటో అటు ఇటు కదులుతూ ఉంటే నేను చూడలేక కళ్ళు మూసుకొని ఒక ప్రక్కకు వెళ్ళి గురువుగారిని తలచుకుంటూ అరుస్తూ ఎక్కిళ్ళు పెట్టి ఏడుస్తున్నాను. మళ్ళీ సాయిప్రేమను సేఫ్‌గా ఎత్తుకుంటాను అని ఊహించలేదు. నేను ఏడుస్తుండగానే వెంకట్ సాయిప్రేమను తీసుకొచ్చి నాకిచ్చి ఏమీ దెబ్బలు తగలలేదు చూడు, సాయిప్రేమ బాగుంది అని చెప్పారు. కాని నేను, వెంకట్ ఆ షాక్ నుండి చాలాసేపటివరకు తేరుకోలేకపోయాము. మేము మాత్రం లోపల ఖచ్చితంగా ఏదో ఫ్రాక్చర్ అయివుంటుందని అనుకొన్నాము. అక్కడున్న వాళ్ళంతా ఎక్స్‌రే తీయించండి అన్నారు.

గురువుగారు ఇచ్చిన అద్భుతమైన అనుభవం ఏమిటంటే సాయిప్రేమకు చిన్న ఫ్రాక్చర్ కూడా కాలేదు. అందులోనూ సాయిప్రేమ చాలా సన్నగా బలహీనంగా ఉంటుంది. అలాంటి పాపమీద ఆటో చాలాసేపు కదులుతూ ఉన్నా ఒక్క దెబ్బ కూడా తగల్లేదు. మా పాప వయసు 3 సం॥ మాత్రమే. ఇలా నా బిడ్డకు చిన్న దెబ్బ కూడా తగలకుండా అంత పెద్ద ప్రమాదం నుండి కాపాడి మళ్ళీ నాకు ఇచ్చారు. ఆయన ప్రేమకి హద్దులు లేవు.

**- సుష్మ, చెన్నై.**

# ఓర్పు - నేర్పు

బిడ్డలమైన మనవి కేవలం ఊహలు, ఆలోచనలు. కానీ వాటి వెనుకనున్న మంచి, చెడులను విశ్లేషించుకుని నిర్ణయం తీసుకొనే శక్తి మనకుందా? అంటే, ఆ శక్తి మనకున్నా, లేకున్నా - బిడ్డల ప్రగతినే ఆశించే గురుదేవుల ప్రణాళిక ఆలోచనకు అందేది కాదు. సాయి చరిత్రలో నార్కే విషయం గమనిస్తే సాయి ఎప్పుడూ నార్కేను పూణేలో స్థిరపరుస్తానని అనేవారు. కానీ, పూణేలో అసలు ఆ విభాగమే లేదు ఆ సమయంలో. కొన్ని సంవత్సరాల తర్వాత భూగర్భరసాయన శాస్త్రం ఒక విభాగంగా ఏర్పడి నార్కే పూణేలో స్థిరపడతారు. గురుదేవులు యువకులతో అన్న ఈ మాటలు చూద్దాం. " ఇదిగో, వీడు వస్తాడు, ఉద్యోగం కావాలంటాడు, ఇస్తాను - పారేసుకుంటాడు - శృతి బొమ్మను పారేసినట్లు. నాకేమీ కోపం రాదు". ఓర్పు ఉన్నా, లేకపోయినా తండ్రిగా ఆయన బాధ్యత - బంధం నిర్వర్తిస్తూనే ఉంటారు నేర్పుగా. బిడ్డకు ఎలాంటి అవకాశమిచ్చి ఉన్నతికి తీసుకురావాలా అన్నదే ఆయన తపనంతా!

**-గురుకృప**

పూజ్య గురుదేవులు శ్రీ బాబూజీ పాదములకు నమస్కారములు తెలుపుకుంటూ నా అనుభవం గురుబంధువులందరితో పంచుకొంటున్నాను. స్వభావరీత్యా నేను పరమ మూర్ఖుడిని, మందమతిని. అటువంటి నేను బాబా, బాబూజీల చెంత చేరడం అనేది కేవలం బాబా సంకల్పం. అర్హత ఏమాత్రం లేకున్నా వారి దయాభిక్షతో నాకు ఒక ఉద్యోగాన్ని ప్రసాదించారు. కాదు, ప్రసాదిస్తూనే ఉన్నారు నేను ఉద్యోగాన్ని మానిన ప్రతీసారి! అయినా ఇంకా ఏదో అసంతృప్తి, నిరాశ, వారు (బాబా, బాబూజీ) నాకు ఏమీ చేయలేదనే విపరీత ధోరణి, ఇలా 2004 సం॥ నుండి. ఒకసారి 2006 ఆగస్టులో ఒక ఇంటర్వ్యూ కోసం రెండు జతల బట్టలతో వైజాగ్ నుండి చెన్నై వచ్చాను. సెలక్ట్ అయ్యాను. ట్రైనింగ్‌కి ఒకరోజు వెళ్ళి మానేసాను. అంతకుముందు రెండు మూడుసార్లు చెన్నై వచ్చినప్పుడు మా అన్నయ్య, మరికొంతమంది గురుబంధువులు నన్ను చెన్నైలోనే ఉద్యోగప్రయత్నం చేయవచ్చుకదా అని అంటుండేవారు. ఏదో ఒకటి చెప్పి దాటవేసేవాడిని. అయితే ఈసారి ప్రయత్నం చేద్దామనిపించింది. ఈ సమయంలో గురువుగారు తిరువణ్ణామలై వెళ్ళారని తెలిసి నేనూ వెళ్ళాను. ఎప్పట్నించో నా పూర్తి పరిస్థితి, నా అర్హత గూర్చి శ్రీబాబూజీకి చెప్పి, వారేదైనా చెప్తే అది చేసుకొందామని ఉండేది. శ్రీ బాబూజీ వెళ్ళినరోజే నేను, మరికొందరు గురుబంధువులు తిరువణ్ణామలై వెళ్ళాము. వారి ఇంటిబయట (హరితాచల) ఊరికే కూర్చొన్నాము. ఇంతలో నరేంద్రన్న మమ్మల్ని చూచి బయటకు వచ్చారు. మేము

చాలాసేపటి నుండి  ఎదురుచూస్తున్న సంగతి తెలుసుకొని, వెళ్ళి విశ్రాంతి తీసుకోండి, రేపు కలుద్దాం అని వెంటనే వెళ్ళిపోయారు. తిరువణ్ణామలైలోనే ఉండదలచుకొనేవారు వెళ్ళి పడుకొన్నారు. చెన్నై వెళ్ళవలసిన నేను, మరికొందరు రోడ్డు ప్రక్కన బెంచ్ మీద కూర్చొని ఉన్నాము (మా కారు డ్రైవరు నిద్రపోతున్న కారణంగా).  అరగంట తర్వాత నరేంద్రన్న బయటకు వస్తూ కన్పించేసరికి మేము ఎదురువెళ్ళాము.ఆయన అటు ఇటు చూసుకుంటూ వస్తున్నారు. మమ్మల్ని చూస్తూనే  గురువుగారు నాతో "బయట నీ కోసం వాళ్ళు ఇంకా ఎదురుచూస్తున్నారు, ఒకసారి వెళ్ళిరా" అన్నారు. ఆయన చెప్పారు కాబట్టి  ఒక్కడైనా ఉండుంటాడు అనుకొని చూస్తూ వస్తున్నాను  అని అన్నారు. కాసేపు మాతో కూర్చొని మాట్లాడారు. నిజానికి నరేంద్రన్నని నా కోసమే గురువుగారు పంపించారు. నేను ఏదైతే శ్రీబాబూజీకి విన్నవించుకోదలచుకొన్నానో  అదంతా అన్నకి చెప్పి, గురువుగారితో చెప్పమన్నాను. అలా నాకు అవకాశం కల్పించారు. చెన్నై వెళ్ళి మరలా అదే రోజు తిరిగి వచ్చాను. అలా రెండు జతల బట్టలతో 24 రోజులు శ్రీబాబూజీ ఇంటి ఎదురింట్లోనే ఉన్నాను. ఒకరోజు అన్న మాతో, గురువుగారు ఉండే ఇంటి బయట ప్రదేశం శుభ్రం చేయండి, ఇక్కడ చక్కగా చేస్తే గురువుగారి ఇంటి వెనుక శుభ్రం చేసే అవకాశం  ఉంటుందని చెప్పారు. నేను, మరికొంతమంది ఆ పని చేశాం. అదేరోజు సాయత్రం, ఆ మర్నాడు వారి ఇంటికి ఆనుకొని ఉన్న వెనుకభాగం శుభ్రం చేసే అవకాశం శ్రీబాబూజీ కల్పించారు. శుభ్రం చేస్తుండగా అన్న వచ్చి  మీరు చేసిన పనిని చూడడానికి ఇప్పుడు గురువుగారు బయటకు వస్తున్నారు అన్నారు.  అంతే! అలసట అంతా ఒక్కసారిగా పోయి మనసంతా ఆనందంతో నిండిపోయింది. కాళ్ళు, చేతులు కడుక్కొని ఓ ప్రక్కగా నిలబడ్డాము. శ్రీబాబూజీ, అమ్మగారు, పాప వచ్చి మేము శుభ్రం చేసిన ప్రదేశంలో నడుస్తూ కన్పించారు. అందరం దగ్గరకి వెళ్ళాము. ప్రతి ఒక్కరిని చక్కగా పలకరించి  ఆదరంగా చూశారు. ఇంతలో బయట ఎదురుచూస్తున్న వాళ్ళు కూడా వచ్చి గురువుగారి దర్శనం చేసుకొన్నారు. అలా 24రోజులు వారి ఇంటి బయట రాత్రి అంతా కూర్చొనేవాడిని. వారి దర్శనంలో "గురువుగారు, నాకు దారి చూపించండి"అని అడిగాను. సరే అన్నట్లు తల ఊపారు. దర్శనమిచ్చిన ప్రతిసారీ అదే అడిగేవాడిని. ఎప్పుడూ అదే వారి స్పందన.

ప్రతిరోజూ రాత్రి ఏదో ఒక సమయంలో అన్న బయటకు వచ్చేవారు. నాకు గురువుగారు ఏమైనా చెప్పారా? అని అడిగాను. "వాడేం చేయగలడో అడుగు"  అన్నారట. నేను ఏమీ చేయలేను, నాకు ఏమీ రాదు. వారినే చెప్పమనండి అన్నాను. అలా గురువుగారు చెప్పరు, నువ్వు బాగా ఆలోచించు,

ఏమి వచ్చో, ఏమి చేయగలవో చెప్పు, నేను గురువుగారికి చెప్తాను అన్నారు అన్న. నిజానికి కబుర్లు చెప్పడం తప్ప నాకు ఏమీ రాదు, ఏమి చేయగలనో నాకు తెలియదు. 24రోజులు రాత్రంతా మేల్కొని ఉండేవాడిని. నాతోటి గురుబంధువులు నన్ను నైట్ వాచ్‌మన్ అనేవారు.

ఒకసారి గురువుగారు పూండీ బయలుదేరి వెళ్ళారు. అందరం రెండు కార్లలో వెళ్ళాం. దారిలో ఆ రెండింటిలో ఒక దానికి పంచర్ అయింది. అరే, దర్శనం మిస్ అవుతామేమో అని బాధపడ్డాం. రోడ్డు అంతా చీకటిగా ఉండడం వలన టైరు మార్చడం కష్టంగా ఉంది. ఇంతలో గురువుగారి కారు అటుగా వెళ్తోంది. మా కారు దాటగానే వారి కారు బాగా స్లో అయ్యి మరలా వెళ్ళిపోయింది. వెంటనే అన్న మాలో ఒకరికి ఫోన్ చేసి సంగతి తెలుసుకొని త్వరగా రండి అన్నారు. రెండవ కారులో కొంతమందిని పంపేశాము. వెంటనే ఒక బైక్ అతను టైరు మారుస్తుంటే లైట్ చూపించాడు. అటుగా వెళ్తున్న ఒక ట్రాక్టరు అతను వచ్చి సహాయం చేసి వెళ్ళాడు. మరలా (20 లేదా 30 నిమిషాల తరువాత) స్టార్ట్ అయ్యాము. గురువుగారు పూండీ నుండి బయలుదేరి వచ్చేస్తుంటారు అనుకొన్నాము. కానీ వారు పూండీ చేరిన 5 నిమిషాలకే మేము చేరాము. అప్పటిదాకా ఫాస్ట్‌గా వచ్చిన గురువుగారు మా కోసంగా నిదానంగా వెళ్ళారు. చక్కగా దర్శనం చేసుకొన్నాము. 24 రోజుల తరువాత గురువుగారు చెన్నై తిరిగి వచ్చేశారు (నాకు దారి చూపకుండా). తరువాత గురువుగారు విజయదశమికి శిరిడీ బయలుదేరుతుండగా వారికి, శిరిడీ నుండి వైజాగ్ వెళ్ళి చెన్నైకి వచ్చేస్తాను, నాకు ఉద్యోగం ఇప్పించి జీవితంలో సెటిల్ అయ్యేలా మీ ఆశీస్సులు ఇవ్వండి అని విన్నవించుకొన్నాను. 'సరే' అని రెండడుగులు ముందుకు వేసి, వెనక్కు తిరిగి మరలా నన్ను చూసి తల ఊపి వెళ్ళారు.

నేను వైజాగ్ వెళ్ళి నా సామానులు అన్నీ తీసుకొని, యూత్ సత్సంగ వార్షికోత్సవానికి తెనాలి చేరి అక్కడే ఉండిపోయాను. సుమారు 7,8 నెలలు అకారణంగా బాబా, బాబూజీలను నిందిస్తూ (నాకు దారి చూపలేదని) దుర్భరమైన జీవితం గడిపాను. ఒకరోజు మా అన్నయ్య ఫోన్ చేసి, నా గురించి అప్పుడప్పుడు నరేంద్రన్న అడుగుతున్నారని, చెన్నైకి వచ్చేయమని చెప్పాడు. నా అన్ని ప్రయత్నాలు విఫలం అయ్యి, వేరే దారిలేని పరిస్థితిలో ఉండి కూడా నాకు ఉద్యోగం ఇప్పిస్తానంటేనే వస్తాను అన్నాను. అలా జూన్ 15, 2007 న చెన్నైకి వచ్చాను. జూన్ 18న ఉద్యోగంలో చేరాను. 'దారి చూపించండి గురువుగారు!' అని అడిగిన దానికి నా ప్రయత్నం ఏమీ లేదు. "చెన్నై వస్తాను, వెంటనే ఉద్యోగం ఇప్పించి, జీవితంలో సెటిల్ అయ్యేలా చూడండి" అని అడిగిన దానికి నా ప్రస్తుత ఉద్యోగం వారి దయాభిక్ష. నేను ఇప్పుడు SIRSAI INC. లో ఐ.టి. రిక్రూటర్‌గా రాత్రి షిఫ్ట్‌లో పని చేస్తున్నాను.

నైట్ వాచ్‌మేన్‌గా ఆరోజు నేను గురువుగారి అనుగ్రహం కోసం వేచి ఉన్న ఆ క్షణాలే నాకు ఉద్యోగపరంగా శిక్షణ అని తెలుసుకోలేకపోయాను. అలా గురువుగారిని అడిగి, నేనే చెన్నైకి రాకుండా కూర్చొని వారిని నిందించిన స్థితి నాది. చెన్నైకి రాగానే నేను చేసిన తప్పులన్నింటినీ తెలుసుకొని గురువుగారిని క్షమాపణ వేడుకొన్నాను. "బాబాను వదిలివేయగలిగితే వదిలివేయండి. కాని, అలా వదలలేరు ఎందుకంటే పట్టుకుంది మీరు కాదు, బాబానే" అన్నారు. శ్రీబాబూజీ. ఇది నా జీవితంలో నాస్వానుభవం, నేర్చుకొన్న పాఠం.

**- పవన్, చెన్నై**

## సుమం - సౌరభం

అది 1912వ సం॥ ఒకానొక పర్వదినంనాడు శ్రీసాయి మహరాజ్ దర్శనార్థమై శిరిడీకి బయలుదేరాడు రేగేసాహెబ్. మన్మాడ్‌లో సాటి సాయిభక్తులంతా పుష్పాలు తీసుకువెళుతుండడం చూసి, తానేమీ తీసుకువెళ్ళడం లేదని చిన్నబుచ్చుకున్నాడు. శిరిడీ చేరి బాబాకు అందరూ పుష్పాలు సమర్పిస్తుంటే చూస్తూ ఉండిపోయాడు రేగే. రేగేను చూసి బాబా ఇలా అన్నారు - " ఇవన్నీ నీవే ". సాయి కరుణకు, సర్వజ్ఞతకు అమితానందుడయ్యాడు రేగే. (**How kind of Baba! What love was his to me! All Forgiving, All Forgetting love.**) గురువుకు మనం సమర్పించేది సుమాలు, అయితే వాటి సౌరభం మాత్రం అనుగ్రహరూపంలో ఎప్పుడూ మనతోనే, తోడుగా, నీడగా ఉండిపోతుంది. పూజ్య గురుదేవుల చెంతకు చేరారు - ఈ గురుబంధువు సుమాలతో! తానందుకున్న అనుగ్రహ సౌరభాలను పంచుకుంటున్నారు మనందరితో!

**- గురుకృప**

ప్రతిజీవి తనపట్ల ప్రేమగా స్పందించి సుఖదుఃఖాలలో ఆనందింపజేసే హృదయాల కోసం వెంపర్లాడటం జరుగుతుంటుంది. కాని గురువుగారి దగ్గర మనము పొందే ఆనందం అంతా ఇంతా కాదు. కాని అది ఎప్పుడు జరుగుతుందా! అని ఎదురుచూస్తాం. ఆ అవకాశం నాకు చాలా అరుదు. కాని గురువుగారి దర్శనం కాకముందే నాకు గురుబంధువులతో పరిచయం, స్నేహం. . . ఇదంతా గురువుగారి దయకాక మరేమిటి? ఏదైనా పొరపాటుగా మాట్లాడినా దాన్ని ఖండించి వివరించడం, మానసిక ఆర్థిక బాధలలో ఉన్నప్పుడు ఆ హృదయాలు స్పందించే తీరు ఎలా వర్ణించాలో నాకు పదాలు రావడం లేదు. అందరిపట్ల ప్రేమగా ఉండండి అని చెప్పకనే చెబుతూనే మనలో ప్రేమను రగిల్చి గురుదేవులు స్పందించే తీరు. అది అనుభవించి తీరాల్సిందే!

1993లో గురువుగారిని స్టేషను నుండి ఆహ్వానించి తీసుకొని రావటానికి అందరూ వెళుతున్నారు. నేను కూడా పూలదండ తీసుకొంటూ మనసులో, అంతమందిలో గురువుగారి మెడలో నేను పూలదండ వేయగలనా? నన్ను దగ్గరకు రానిస్తారా? అని రకరకాల ఆలోచనలతో వెళ్ళాను. నేను అనుకున్నట్లు పూలదండ మెడలో వేయగానే, క్రింద పడుతున్న దాన్ని తీసుకొని మెడలో వేసుకొని నన్ను ఒక్కసారి చూసి పూలదండను ప్రక్కవారికి ఇచ్చేసారు. గురువుగారు చూసిన ఆ చూపులో ఏముందో నాకు తెలియదు కాని చాలా అద్భుతానందం. అందుకే అంటారు - సద్గురువు అద్దం వంటివారు అని.

నేను గురువుగారి పాదదర్శనం చేసుకొన్నప్పుడల్లా నా కుమార్తెల వివాహాల గురించే అడుగుతుండేవాడిని. 2004 మార్చి 10న మా పెద్ద కుమార్తె వివాహం జరిగింది. ఆ వివాహానికి గురువుగారు చేసిన ఏర్పాట్లు నేను మరచిపోలేను. మా దగ్గర 10వేల రూపాయలు మాత్రమే ఉన్నవి. కట్నకానుకలకు, పెళ్ళి ఖర్చులకు ఇంకా 90 వేలు కావాలి. అవి అమర్చిన గురువుగారి కృపకు పాదనమస్కారములు తెలుపుకొంటున్నాను. నేనుకాని, నా భార్యాపిల్లలు కాని విమానంలో ప్రయాణం చేస్తామని అనుకోలేదు. మా అల్లుడు బెహరిన్‌లో ఉద్యోగం చేస్తున్నారు.13.5.2005న హైదరాబాదులో విమానం ఎక్కడానికి వెళ్ళాను. ఏవైపు నుండి చూసినా ప్రతి పని గురుఅనుగ్రహంతోనే జరుగుతున్నది. విమానాశ్రయంలో మేము తీసుకెళ్ళిన బ్యాగ్స్‌ని చెక్ చేస్తున్నారు. నా కూతురు బ్యాగ్స్‌లో ఉన్న పచ్చళ్ళు అన్నీ చెక్ చేసేటప్పుడు గందరగోళం చేస్తారేమోనని అనుకొంటున్న సమయంలో బ్యాగ్స్ తీయగానే గురువుగారి ఫోటో ఉండడంతో అది చూసిన సెక్యూరిటీ ఇక ఏవిధమైన చెకింగ్ చేయకుండా మమ్మల్ని పంపించారు. గురువుగారి అనుగ్రహానికి నా నోట మాట రాలేదు. నన్ను నేను మరచిపోయాను. గురుప్రేమను, గురు రక్షణను స్మరిస్తూ, గురువుగారికి పాద నమస్కారములు తెలుపుకుంటూ.

**- ఈశ్వరరావు, తెనాలి**

గమనంలో వేగమే కాని, గమ్యంపట్ల అవగాహన లేని సమాజానికి వెలుగు దివ్వెగా, జ్ఞానజ్యోతిగా నిలచి ప్రయాణంలోని ఆనందాన్ని ఆస్వాదింపచేసి, గమ్యం పట్ల, గమనం పట్ల అవగాహననేర్పరచి, లక్ష్య సాధనలో మనలను ధీరులను చేసే పథమే గురుపథం.. సద్గురు పథం... సాయి పథం

**సాయి సమగ్రదర్శిని : saibaba.com**

# గురుర్దేవోభవ

'గురుర్దేవోభవ' అంటూ ఏనాడో ఆధ్యాత్మికవాణి జేగంటలా మార్మోగింది. అర్థం తెలుసుకున్నవారు ఆచరించుకుంటూ పోయారు, 'గురుకృప'తో ఆ (గురువు) గమ్యాన్ని ఏనాడో చేరారు. గమ్యాన్ని చేరినవారు గుహ్యంగా, గుప్తంగా ఉండిపోలేదు - మనకు ఆ భాగ్యాన్ని కల్పించి వారివంతు కృషిని సద్గురు అనుగ్రహంతో చేసుకుంటూ, తమకు తెలిసిన మంచిని పంచటమనే మానవ నైజాన్ని "గురుర్దేవోభవ - నీకు గురువే దేవుడు అగు గాక" అని మనఃస్ఫూర్తిగా ఆశీర్వదించారు. మనమందరం గురుపథంలో పయనించాలని ఆకాంక్షించారు. స్కాంద పురాణంలోని గురుగీత ఇలా ఆశీర్వదించింది మనలను- "గురోః ప్రసాదదన్యత్ర నాస్తి సుఖం మహీతలే" - గురుదేవుని అనుగ్రహమునకు దూరంగా ఈ ప్రపంచములో సుఖమనేది ఎక్కడా లభించదు. శ్రీ సాయి ఆచరణకు సజీవ సాక్ష్యం కదా ఈ గురుగీత వచనాలు.

గురు బంధువుల్లారా! మనకు తెలిసిన పురాణేతిహాసాలను, వేదాలను, ఉపనిషత్తులను క్రోడీకరించుకుందాం, మనందరకు తెలిసిన మహాత్ముల చరిత్రలనన్నింటిని విశ్లేషించుకుందాం, వారి వారి అనుభవాలే కాక చివరకు మన స్వానుభవాలను సమగ్రంగా పరిశీలించుకుందాం. ఇదొక చారిత్రక సమయం - ఒక స్థిర నిశ్చయానికి వద్దాం - పిడకలేరుకోవద్దంటూ సాయి చేసిన ప్రేమపూర్వక హెచ్చరికకు, బిడ్డలుగా మన ఆచరణలో మార్పు అవసరమైతే ఆనందంగా ఆ మార్పుకు సిద్ధమవుదాం. 'నీ గురువే నీకు దేవుడు అగు గాక' అని వేదం దీవిస్తే, రామ, కృష్ణ అవతార కార్యాలలో సాక్షాత్తూ దైవం - అందునా ఆజన్మ పరిపూర్ణులుగా అవతరించినా, సద్గురు సమాశ్రయాన్ని, గురు సన్నిధాన ప్రభావాన్ని ఈ జగత్తంతా ఎరుకపరచారు. ఇక మహాత్ముల విషయానికొస్తే శ్రీసాయివంటి సద్గురు సామ్రాట్టు సద్గురు పథాన్ని దేదీప్యమానంగా ప్రకాశింపచేస్తే, వివేకానందస్వామివంటి యువకులు రామకృష్ణుల వంటి సద్గురువును ఆశ్రయించి సుప్తావస్థలో ఉన్న ఆధ్యాత్మికతకు ప్రాణం పోసి భావి భారత ప్రగతి నిర్మాతలయ్యారు.

ఇక శాస్త్రాలను ఆధారం చేసుకుని - సద్గురువనే ధర్మానికి ఆకారాన్ని రూపుదిద్దుకుందాం. రామాయణంలో యాగరక్షణకై రాముని తనతో పంపమని అడుగుతూ విశ్వామిత్రుడు "రాముడు నా గుప్తమయిన రక్షణలో తన స్వతేజస్సుతో దుర్మార్గులయిన రాక్షసులందరినీ నాశనము చేయ సమర్థుడు. ఈ రామునికి మూడు లోకాల్లోనూ ప్రఖ్యాతి గలుగునట్లు నానావిధములయిన శ్రేయస్సును

ఇచ్చెదను" అని దశరథునికి హామీ ఇస్తాడు. సద్గురుమూర్తి అయిన విశ్వామిత్ర మహర్షి అనుగ్రహం అవతారమూర్తియైన శ్రీరామునికి రక్షణయై, ధర్మ సంస్థాపన చేసింది. రామునికి హితం చేకూర్చుటకై సద్గురుమూర్తి అయిన విశ్వామిత్రుడు దశరథుని యాచించుటకు కూడా సిద్ధమయ్యాడు. అవతార పురుషుడయిన రాముడు సద్గురు అనుగ్రహాభిలాషియై విశ్వామిత్రుని వెంట నడిచాడు. ఎన్నో వత్సరాలుగా పడి ఉన్న రాతిని నాతిగా మార్చాడు. గురుర్దేవోభవ అంటూ పురాణేతిహాసాలు చెప్పే బోధలివి.

మహాత్ముల విషయానికొద్దాం. అనన్యంగా గురుపథంలో పయనిస్తే అట్టి భక్తుల భావాలకు ఉండే ఫలితాన్ని గమనిద్దాం - స్వామి బ్రహ్మానంద- శ్రీ రామకృష్ణుల అనుంగు సన్యాస శిష్యుడు. ఒకానొక తీవ్రమైన కరువు సమయంలో, ఆహారానికి ఎంతో ఇబ్బంది పడతారు. అప్పుడు విచారంగా బ్రహ్మానంద ఇలా అనుకున్నారు "గురుదేవా! నాకొక ముద్ద అన్నం ఇవ్వలేని వానివి, నన్నెందుకు ఇంటినుండి బయటకు తీసుకు వచ్చావు. రేపు ఉదయం నేను వేడి వేడి కిచిడీ, ఊరగాయ పొందితే నీవు నాతోనే ఉన్నట్లు భావిస్తాను" అని అనుకుంటారు. ఆ మరుసటి రోజు ఉదయం స్వాములిరువురూ (బ్రహ్మానంద, తురీయానంద) సరయూనదిలో స్నానానికి వెళ్ళారు. ఒక సన్యాసి వారికి కనిపించి బ్రహ్మానందస్వామితో "స్వామీ! మీరిరువురూ నిన్నంతా ఉపవాసం చేసినట్లున్నారు. నా ఆశ్రమానికి వచ్చి, శ్రీరామునకు నివేదించిన ప్రసాదం కొద్దిగా స్వీకరించండి" అంటూ వేడి వేడి కిచిడీ, ఊరగాయ వడ్డించారు. వారు ఆ పదార్థాలను ఆనందంగా భుజించారు. అప్పుడు ఆ వడ్డించిన స్వామి ఇలా అన్నారు, "నేను ధన్యుడను! గత 24 సంవత్సరాలుగా శ్రీరామచంద్ర ప్రభువు స్వరం వినాలని, సుందరరూపం దర్శించాలనీ, నేనిచట సాధనలు చేస్తున్నాను. ఈ రోజుకి నా ప్రభువు నన్ను అనుగ్రహించారంటూ', ఆనందభాష్పాలతో తెలియజేశారు. బ్రహ్మానందస్వామి ప్రార్థనపై ఆ స్వామి ఇలా వివరించారు "నేను క్రితం రాత్రి నిద్రిస్తుండగా శ్రీ రామచంద్ర ప్రభువు తమ కోమల హస్తంతో నన్ను తట్టి లేపి, 'వెంటనే లే! నాకు ఆకలిగా ఉంది. కిచిడీ వండి నాకు నివేదించు. రేపు ఉదయం సరయూనది తీరాన ఇరువురు భక్తులు స్నానం చేయటం చూడగలవు... వారికీ ప్రసాదం సమర్పించు' అన్నారు. నాకు మీ అనుగ్రహం వల్ల శ్రీరామచంద్ర ప్రభువు దర్శనం కలిగింది." మహాత్ముల వాణి ఇలా ఉంది. బిడ్డకు ఆకలైతే - సద్గురు సంకల్పానుసారం సాక్షాత్తూ భగవంతుడు కూడా దర్శనమివ్వవలసి వచ్చింది. ఇది కదా సద్గురు మహిమ. అందుకే కబీరన్నాడు - నాకు గురువు,



దైవం ఒకేసారి కానవస్తే నేను మొదటగా గురువుకే నమస్కరిస్తానని. రామపాదం తాకి రాయి అహల్య అయితే, ఒక గురుభక్తి పరాయణునికి భోజనం అందించటానికి 24 సం॥ల తరువాత రాముడు తరలి వెళ్ళాడు. అనన్య గురుభక్తి - అపార అనుగ్రహ శక్తి.

ఇదండీ! శాస్త్రం, మహాత్ముల వాణి. ఇక ఇహపర శ్రేయోదాయి సాయి మాటలను అవగాహన చేసుకునే ప్రయత్నం చేసుకొనే ప్రయత్నం. మన మస్తిష్కం నిండా ఉండే ఆలోచనలను కట్టిపెట్టి, తలను చేతపట్టి, చివరకు ఒక పుల్లనైనా సరే గురువుగా పెట్టుకోండిరా, అది మిమ్మల్ని గమ్యం చేరుస్తుంది అంటూ సాయిమాత దీవించింది. మనకు ఇంతకంటే ఏం కావాలి. మసీదులో కూర్చొని సాయి మహరాజ్ చెప్పిన ఏ మాటా కూడా అసత్యమవలేదు నేటికీ! కనుక, మన మన జీవితానుభవాలను విశ్లేషించుకుని, చిత్తశాంతిని అందించిన గురుసాన్నిధ్యాన్ని ఉపయోగపెట్టుకునే ప్రయత్నానికి సమాయత్తమవుదాం! అనన్య శరణాగతి పథంలో పయనించి 'గురుర్దేవోభవ' అని అందరినుంచి దీవెనలందుకుని తరతరాలకు, జన్మజన్మలకు సద్గురు చరణ కమలాల చెంత సుమాలై ఈ జగమంతా సౌరభాలను వెదజల్లుదాం. ఈ నూతన వత్సరంలో అనన్యశరణాగతి పథానురక్తులమై గురుస్మరణలో మునిగి తేలుదాం....

**-గురుకృప**

ఏ మహాత్ముని కంటిచూపు మనలోని చైతన్యాన్ని మేల్కొలుపుతుందో,
ఏ పరమ పవిత్రుని వాక్కు మనలను వెన్నంటి తరుముతుందో,
ఏ పుణ్య పురుషుని సాన్నిధ్యం మన మనస్సును ఆనంద తీరాలను చేర్చుతుందో,
ఏ సత్పురుషుని పాదస్పర్శ మనలను గమ్యం చేరుస్తుందో
- వారే గురువు.



అతి సుందరమైన రూపం,
అవ్యాజమైన ప్రేమ,
అక్కున చేర్చుకునే కరుణ.
అతి మధురమైన నామధేయం, అపారమైన జ్ఞానం
సుమధుర చరితం,
సమ్మోహనమైన వీక్షణం.
సముద్రమంత గాంభీర్యం, కరుణ కురిపించే ప్రేమతత్త్వం
చిరుజల్లులాంటి చిరునవ్వు,
భయం పోగొట్టే అభయం.
చల్లని దీవెనల వరద హస్తం, చింతలు తీర్చే చరణ కమలం,
పరవశింపచేసే పలకరింపు,
ఓర్పునిచ్చే ఓదార్పు.
మూర్తీభవించిన అనుగ్రహం, మరల్చుకోలేని మూర్తిమత్త్వం,
బాధ్యత తీసుకునే బంధం,
అనుభూతులనొసగే అనుబంధం.
బోధించని ప్రబోధం, నేర్చుకొమ్మనే నిరాడంబరత్వం,
సవ్యంగా సాగేందుకు సమయ పాలనం,
శ్రద్ధ పెంపొంద నియమపాలనం,
కంచెలాంటి సత్సంగం, కాపాడే సాయినామం.

సద్గురూ! సర్వగుణ సంపన్నుడవైన నిన్ను కీర్తించ శృతి, స్మృతులే తెల్లబోతే
ఇక మేమెంత! చిన్నారులం - నీ చల్లని నీడలో వెలిగే చిరుదివ్వెలం.